సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 4 । మే । 2023



పెరుగుతున్న విద్యుత్ వినియోగం

వేసవి తాపం పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. ఈ ఏడాది మార్చి నుంచే డిమాండ్ ఎక్కువైంది. 8లో



తడిసిన ధాన్యం కొనాలి

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కోరారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
$33^{\circ} / 25^{\circ}$

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం

బూర్గంపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని గొమ్మూరు వ్యవసాయ క్షేత్రంలో శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు గాను కల్యాణోత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం రాత్రి తిరుమల నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో సహా వేదపండితులు కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. కలియుగ దైవమైన శ్రీనివాసుని కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు తరలిరావాలని కోరారు.

నిషేధిత మందులు అమ్మితే చర్య తప్పదు



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఐ

మణుగూరుటౌన్: నిషేధిత మందులు విక్రయించే షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. మణుగూరులోని పలు మెడికల్ షాపులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల లైసెన్స్, మందలు నిల్వ వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మందులు విక్రయించాలని సూచించారు. స్టాక్, విక్రయాలు, షాపు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు.

జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేయాలి

చుంచుపల్లి: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలకు వచ్చే జ్వర పీడితుల్లో కనీసం 10 శాతం మందికి రక్త పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు. బుధవారం ఆమె ఎల్‌టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్‌తో బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్.జేవీఎల్ శిరీష సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్త పరీక్ష శాంపిళ్లను టీ హబ్‌కు పంపించాలన్నారు. రోజూ వర్షాలు కురుస్తునందున ప్రతి గ్రామంలో జ్వర సర్వే నిర్వహించాలని చెప్పారు. డెంగీ, మలేరియా కేసులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, డీడీఎంహెచ్‌ఓ ఫయిజుద్దీన్, నగేష్, కుమారస్వామి, హరికృష్ణ, లాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వంపై కొరడా..

సింగరేణి ఆస్పత్రుల్లో తిష్ట వేసిన నిర్లక్ష్యం

- సమయపాలన పాటించని వైద్య సిబ్బంది
- సింగరేణి మెడికల్ బోర్డుపై ఆరోపణలు
- ఆకస్మిక తనిఖీలు చేస్తున్న డైరెక్టర్ (పా)
- మూడు ఆస్పత్రుల్లో 39 మందికి నోటీసులు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో చికిత్సపై ఆరా తీస్తున్న డైరెక్టర్(పా) బలరామ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మికుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో ఈ అంశంపై సింగరేణి ఉన్నతాధికారులు నజర్ పెట్టారు. అందులో భాగంగా సింగరేణి వ్యా ప్తంగా ఉన్న ఆస్పత్రులను వ రుసగా తనిఖీలు చేస్తున్నారు.

వందల సంఖ్యలో వైద్య సిబ్బంది..

ఉత్తర తెలంగాణాలోని ఆరు జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ గనులు 24, ఉపరితల గనులు 14 ఉండగా వీటిలో 43వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులు, వారి కుటుంబసభ్యుల సంక్షేమం కోసం సంస్థ పరిధిలో కొత్తగూడెంలో ప్రధాన ఆస్పత్రి, బెల్లంపల్లి, భూపాలపల్లి, గోదావరిఖనిలో రీజనల్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటికి తోడు ఇల్లెందు, మణుగూరు, శ్రీరాంపూర్, గోలేటిలలో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఇవి కాకుండా సంస్థ పరంగా ఏడు డిస్పెన్సరీలు ఉన్నాయి. ఇందులో వందల సంఖ్యలో మెడికల్, పారా మెడికల్ సిబ్బంది పని చేస్తున్నారు.

సేవల్లో కొరవడిన నాణ్యత..

సింగరేణి నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవల నాణ్యతపై కార్మికులు, వారి కుటుంబ సభ్యుల నుంచి తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఒకప్పుడు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించిన ఆస్పత్రులు ఇప్పుడు నామమాత్రంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికులకు ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లడం లేదా సింగరేణి ద్వారా రిఫర్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవల్లో డొల్లతనం కారణంగా సంస్థలో మెడికల్ అన్‌ఫిట్‌లు పెరిగిపోయాయి. వీటికి అనుసంధానంగా ఉండే మెడికల్ బోర్డు నిర్వహణపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. వెరసి సంస్థకు చెడు పేరు రావడమే కాకుండా సంస్థ నిర్వహణ తీరుపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితి వచ్చింది.

ప్రధాన ఆస్పత్రిలోనూ..

సంస్థ మేనేజ్‌మెంట్‌లో నంబర్ 2గా పరిగణించే డైరెక్టర్ (పా) ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి సిబ్బందిలో ఎలాంటి మార్పూ రాలేదు. యథావిధిగానే విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడం కొనసాగిస్తూ వచ్చారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం కొత్తగూడెం ఆస్పత్రిలో తనిఖీ చేయగా ఇన్‌టైమ్‌లో 26 మంది వైద్యులు సిబ్బంది విధులకు హాజరుకానట్టుగా వెల్లడైంది. ఇందులో ఆరుగురు సరైన కారణాలు చూపగా మిగిలిన వారు అందులో విఫలమయ్యారు. దీంతో ఏకాఏకిన 20 మందికి నోటీసులు జారీ అయ్యాయి. అదే విధంగా సింగరేణికి 536 రకాల ఔషధాలు సరఫరా కావాల్సి ఉండగా ఇందులో 112 రకాల ఔషధాలు సరఫరా కాని వైనం వెలుగు చూసింది. దీంతో ఫార్మసిస్టును బదిలీ చేయడంతో పాటు ఈ అంశంపై మరింత లోతుగా విచారణ చేపట్టాలని నిర్ణయించారు. మొత్తంగా వారం, పది రోజుల వ్యవధిలో సింగరేణి పరిధిలోని 39 మందికి నోటీసులు జారీ చేయడం సంచలనంగా మారింది.

ఆకస్మిక తనిఖీలు..

కార్మికుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రాకపోవడంపై సింగరేణి డైరెక్టర్ పా (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) దృష్టి సారించారు. ఉన్నపళంగా సంస్థ పరిధిలోని ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేయడం మొదలెట్టారు. గతనెల 25న భూపాలపల్లి ఆస్పత్రిలో తనిఖీ చేపట్టగా అక్కడున్న సిబ్బంది సమయపాలన పాటించని విషయం వెలుగు చూసింది. దీంతో అక్కడ ఐదుగురు వైద్యులకు నోటీసులు అందించారు. ఆ వెంటనే శ్రీరాంపూర్ ఆస్పత్రిలో తనిఖీ చేయగా అక్కడా ఇదే పరిస్థితి ఉండటంతో 14 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కారులో 'వారు' వద్దు!

- పాలేరు సీటు విషయంపై అధిష్టానానికి ఫిర్యాదు
- కమ్యూనిస్టులను ప్రోత్సహిస్తున్నారని ప్రస్తావన
- వైరాలో ఇతర నేతల పెత్తనంపై గుర్రు
- మహబూబాబాద్‌లో ఇల్లెందు నేతల భేటీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వివిధ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతల నడుమ ఉన్న పొరపొచ్చాలు తారాస్థాయికి చేరుతున్నాయి. సిట్టింగ్‌కే సీటు ఇవ్వాలని, కమ్యూనిస్టులను ప్రోత్సహించొద్దని ఓ నియోజకవర్గ నేతలు.. తమ పెత్తనం కొనసాగడం లేదని ఇంకో నియోజకవర్గంలో.. మరో చోట తాము ప్రతిపాదించే వారికే టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. అంతేకాక పక్క జిల్లాలకు వెళ్లి అంతరంగిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని పాలేరు, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల్లో కొద్దిరోజులుగా జరుగుతున్న ఈ పరిణామాలపై విస్తృతంగా చర్చ సాగుతోంది. అయితే, అధిష్టానం పెద్దలు మాత్రం అందరి ఫిర్యాదులను సావధానంగా విని సముదాయించి పంపుతున్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఎన్నికల తరుణాన బీఆర్ఎస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

పాలేరు సీటుపై రచ్చ..

ఉమ్మడి జిల్లాలో ఆది నుంచి పాలేరు సీటుపై రచ్చ కొనసాగుతోంది. బీఆర్ఎస్‌తో సీపీఎం, సీపీఐకి పొత్తు కుదిరితే సీపీఎం ప్రాధాన్యతగా పాలేరును కోరుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కానీ ఇప్పటివరకు పొత్తుపై ప్రకటన వెలువడ లేదు. అయితే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ వచ్చే ఎన్నికల్లో తప్పక బరిలో నిలుస్తామని ప్రకటించారు. మరోపక్క బీఆర్ఎస్ నేతలు పాలేరు నుంచి మళ్లీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డే పోటీ చేస్తారని వెల్లడించారు. వారం క్రితం ఎమ్మెల్యే కందాల అనుచరులు నియోజవర్గ రాజకీయ పరిస్థితులను విన్నవించేందుకు సీఎంను కలవడానికి వెళ్లగా అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డిని కలిసినట్లు సమాచారం. కొందరు పార్టీ నేతలు కమ్యూనిస్టులను ప్రోత్సహిస్తున్నారని చెప్పినట్లు తెలిసింది. అయితే, నాయకులు మాత్రం ధాన్యం కొనుగోలు విషయమై పల్లాను కలిసినట్లు చెబుతున్నా, కందాలకు టికెట్, కమ్యూనిస్టుల దూకుడుపైనే చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది.

పెత్తనంపై వైరాలో వార్

వైరా నియోజవకర్గంలోని ఆత్మీయ సమ్మేళనాల్లో నేతల అలకలు వారి మధ్య అంతరాన్ని పెంచుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగుల బదిలీల్లో తమ ప్రతిపాదనలను తొక్కిపెట్టి ఇతర నేతలు పెత్తనం చెలాయిస్తున్నారని పార్టీ నేతలు అధిష్టానం ముందు వాపోయినట్లు సమాచారం. ఎక్కడా తమకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఇతర నేతలు నియోజకవర్గ రాజకీయాల్లో తలదూర్చుతున్నట్లు చెప్పారని ప్రచారం జరుగుతోంది. మరోపక్క పార్టీపరమైన కార్యక్రమాలన్నీ మూడు గ్రూపులుగా నిర్వహిస్తున్నారు. గ్రూప్ రాజకీయాలు చేస్తున్న వారిని గాడిలో పెట్టకపోవడం, పార్టీ సమావేశాలకు వారిని ఆహ్వానించకపోవడం వంటి పరిణామాలతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ మూడు ముక్కలాటలా మారిందని కేడర్‌లో చర్చ జరుగుతోంది.

మహబూబాబాద్‌లో ఇల్లెందు రాజకీయం..

ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ రాజకీయం ఇటీవల మహబూబాబాద్ కేంద్రంగా వేడెక్కింది. కొందరు నేతలు మహబుబాబాద్‌లో సమావేశమై ఎమ్మెల్యే హరిప్రియపై అసమ్మతి జెండా ఎగురవేసినట్లు తెలిసింది. అలాగే, ఎంపీ కవితకు నియోజకవర్గంలో కొన్నాళ్ల పరిణామాలను వివరించి ఇకనుంచైనా దృష్టి సారించి పార్టీ కోసం పనిచేసే వారిని కాపాడుకోవాలని కోరినట్లు సమాచారం. అలాగే మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు అసమ్మతి నేతలు సమాయత్తమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాస రాజకీయం జోరుగా సాగినా ఆ తర్వాత చల్లారింది. ఇంతలోనే ఎమ్మెల్యేపై ఓ వర్గం తిరుగుబావుటా ఎగురవేసి మహబూబాబాద్‌లో భేటీ కావడం చర్చనీయాంశమైంది.

18 ఇసుక రీచ్‌లకు అనుమతి

కలెక్టర్ అనుదీప్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో 18 ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడీఓసీలోని తన చాంబర్‌లో బుధవారం ఆయా శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బూర్గంపాడు మండలంలో బూర్గంపాడు, ఉప్పుసాక, పాల్వంచ మండలం దంతెలబోర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. టీఎస్ఎండీసీ ద్వారా గోదావరిలో ఇసుక తీసేందుకు పినపాక మండలంలో ఆరు, మణుగూరులో 3, అశ్వాపురంలో ఒకటి, చర్లలో ఒకటి, భద్రాచలంలో ఒకటి, దుమ్ముగూడెం మండలంలో మూడు రీచ్‌లకు అనుమతి ఇచ్చామని వివరించారు. ఇసుక మేటలు వేసిన భూముల్లో అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తప్పుడు నివేదికలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టా భూముల్లో ఇసుక తీసిన తరువాత వ్యవసాయం చేస్తున్నారా లేదా అనే విషయంపై వ్యవసాయాధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు రీచ్‌ల ఏర్పాటుకు సిఫారసులను ఇరిగేషన్ సీఈ, జిల్లా వ్యవసాయాధికారుల ద్వారా కమిటీకి ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. అనుమతులు మంజూరు చేసిన ప్రకారం ఇసుక తీస్తున్నారా లేదా అనే విషయమై విచారణ చేపట్టాలని టీఎస్ఎండీసీ పీఓను ఆదేశించారు. మాన్యువల్‌గా తీసేందుకు అనుమతిచ్చిన రీచ్‌లలో యంత్రాల వినియోగించకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో మైనింగ్ ఏడీ అజయ్‌సింగ్, ఇరిగేషన్ ఈఈలు అర్జున్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, భూగర్భజల అధికారి బాలు, టీఎస్ఎండీసీ పీఓ ఎల్లయ్య, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కలెక్టరేట్ ఏఓ గన్యా, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాసయాదవ్, పంచాయతీ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూన్ 1న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల తనిఖీలు

జూన్ 1న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల మొదటి దశ తనిఖీలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఆర్‌డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాంను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గోడౌన్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గోదాం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎం గోదాంను తనిఖీ చేసి నివేదికను పంపనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, కొత్తగూడెం తహసీల్దార్ శర్మ, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ ఉన్నారు.

గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి

భద్రాచలం: హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్ల(హెచ్‌పీఎస్)కు ఎంపికైన గిరిజన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఐటీడీఏ డీడీ రమాదేవి సూచించారు. రామంతాపూర్, బేగంపేటల్లోని హెచ్‌పీఎస్‌ల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు భద్రాచలంలోని పీఎంఆర్సీ భవనంలో బుధవారం డ్రా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను డీడీ అభినందించి మాట్లాడుతూ ఆరు సీట్లకు గాను కోయ తెగ నుంచి ముగ్గురు, లంబాడీల నుంచి ఇద్దరితో పాటు ఇతర గిరిజన తెగల నుంచి ఒకరిని ఎంపిక చేశామని తెలిపారు. మళ్లీ రాష్ట్రస్థాయిలో లాటరీ ద్వారా తుది ఎంపిక ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఎస్.మాధవరావు, సమ్మయ్య, రమణయ్య, నరసింహారావు, ఎస్.వీరకుమారి, ప్రమీలాబాయి, సీహెచ్.రమణమూర్తి, రంగయ్య పాల్గొన్నారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో డీడీ, అధికారులు

పట్టాలు లేక పాట్లు..



టార్పాలిన్లు లేక బస్తాలతో కుట్టించిన పట్టాలను ధాన్యంపై కప్పుతున్న రైతులు

- ఐదేళ్లుగా నిలిచిపోయిన సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ
- ప్రైవేటుగా కొనుగోలు చేస్తే నాణ్యత లేక ఇబ్బందులు
- వానొస్తే గోనె సంచులు, అద్దె పరదాలే దిక్కు
- అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట తడిసిపోతున్న వైనం

పాల్వంచరూరల్ : ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయంటే రైతుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట ఎక్కడ వర్షార్పణం అవుతుందోననే భయం వారిని వెంటాడుతోంది. ఇదే సమయంలో ఆరబోసిన ధాన్యం వానకు తడవకుండా ఆపే టార్పాలిన్ల కొరత జిల్లా వ్యాప్తంగా ఉండటం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది.

యాసంగిలో కష్టాలు..

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 30,557 మంది రైతులు 62,416 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు యాసంగిలో కల్లాల వద్ద ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వచేసిన ధాన్యం, మిర్చి పంటలు పూర్తిగా తడిసి ముద్దవుతున్నాయి. గతంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు (పట్టాలు) అందజేసేవారు. మార్కెట్‌లో టార్పాలిన్ ధర రూ.2500 ఉంటే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ పోను మిగితా రూ.1250 చెల్లించి రైతులు కొనుగోలు చేసేవారు. దీంతో నాణ్యమైన 6x8 మీటర్ల టార్పాలిన్లు లభించేవి. అయితే ఈ పథకాన్ని 2017లో ఆపేశారు. దీంతో గత ఆరేళ్లుగా సబ్సిడీ టార్పాలిన్ల సరఫరా నిలిచిపోయింది.

ప్రైవేటులో నాణ్యత లేదు..

సబ్సిడీ పట్టాల పంపిణీ ఆగిపోవడంతో రైతులు మార్కెట్‌లో ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన టార్పాలిన్లు నాణ్యత, మన్నికలో మెరుగ్గా ఉండి చాలా ఏళ్లపాటు ఉపయోగపడేవి. ప్రైవేటు వ్యాపారుల వద్ద అధికంగా డబ్బు వెచ్చించి కొనుగోలు చేసినా.. మన్నిక, నాణ్యత లేక అకాల వర్షాలు పడినప్పుడు అవి పంటలను రక్షించలేకపోతున్నాయి. అంతేకాక.. గ్రామాల్లో కొందామన్నా టార్పాలిన్లు అందుబాటులో ఉండకపోవడంతో ఖమ్మం, వరంగల్, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెకు పరదాలు

ధాన్యం నిల్వలు వర్షానికి తడవకుండా రైతులు పరదాలు అద్దెకు తీసుకొచ్చి వినియోగించుకుంటున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నట్లు కనిపిస్తే వెంటనే భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు పట్టణాలకు వెళ్లి పరదాలను అద్దెకు తెస్తున్నారు. రోజుకు రూ.20 చొప్పున అద్దె వసూలు చేస్తుండగా రానుపోను చార్జీలు, ఇతర ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతోందని, మబ్బులు కమ్మినప్పుడల్లా రూ. 300 వరకు వీటికోసం వెచ్చించాల్సి వస్తోందని చెబుతున్నారు.

గోనె సంచులే దిక్కు..

ప్రైవేటు వ్యాపారుల దగ్గర టార్పాలిన్లు కొనలేని రైతులు నేటికీ పాత, పాడైన టార్పాలిన్లనే వినియోగిస్తున్నారు. కొంతమంది గోనె సంచులపైనే ఆధారపడుతున్నారు. చిరుజల్లులు పడినప్పుడు ఈ గోనె సంచులు కొంత మేర ఉపయోగపడుతున్నా.. భారీ వర్షం వస్తే రైతులను నిండా ముంచేస్తున్నాయి. తడిసిన ధాన్యంలో తేమ అధికంగా ఉంటే అటు కొనుగోలు కేంద్రాల్లోనూ ఇక్కట్లు తప్పడం లేదు.

అధిక ధర పెట్టినా ఉపయోగ పడడం లేదు



ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నాం. అవి పొడవు, నాణ్యత తక్కువగా ఉంటున్నాయి. వర్షాలు కురిసినప్పుడు ధాన్యం తడవకుండా ఆపలేకపోతున్నాయి. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్లు సరఫరా చేయాలి.

– జె.రాజు, రైతు, దంతెలబోరు

రైతుబంధు డబ్బుతో కొనుగోలు చేయండి



సబ్సిడీ టార్పాలిన్ల పథకాన్ని ఆరేళ్ల కిందటే ప్రభుత్వం నిలిపేసింది. 2017 నాటికి జిల్లా వ్యాప్తంగా 24 వేల టార్పాలిన్లకు డిమాండ్ ఉండేది. ఇప్పుడది మరింతగా పెరిగింది. ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బుతో టార్పాలిన్లు కొనుగోలు చేయడం మంచిది.

– అభిమన్యుడు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ఆదివాసీ సాంస్కృతికోత్సవాలు షురూ

హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత రామచంద్రయ్య





సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న సకిని రామచంద్రయ్య

భద్రాచలంటౌన్: ఆదివాసీ సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే ఆకుపచ్చ రంగు వస్త్రాలు, అపురూప వేషధారణ, అడుగులో అడుగేస్తూ గిరిజనుల ఆట–పాట అందరినీ ఆకట్టుకున్నాయి. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు 'రేలా పండుం' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ డోలు వాయిద్య కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కళల సంస్కృతికి పునాది ఆదివాసీ సంస్కృతేనని చెప్పారు. అనంతరం పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. తమ సాంస్కృతిక జీవనం, కళలు అన్నీ ప్రకృతి, అడవి, శ్రమతో మిళితమై ఉన్నాయని అన్నారు. అడవి, ప్రకృతి నుంచి ఆదివాసీలను దూరం చేయాలని పాలకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బండారు రవికుమార్, ఆదివాసీ సంఘం నాయకులు నేస్రం రాజు, పాయం రవివర్మ, కారం పుల్లయ్య, వజ్జ సురేష్, సున్నం గంగ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రిస్టియన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

ఇల్లెందు: క్రిస్టియన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ ఇల్లెందు ఏరియా అధ్యక్షుడు సకినాల డేవిడ్‌రాజు కోరారు. బుధవారం ఇల్లెందు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ సంఘం జనరల్ సెక్రెటరీ గోనే సాల్మాన్ రాజ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు సహకరిస్తామని తెలిపారు. అయితే క్రిస్టియన్లకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం హైదరాబాద్‌లో ఓ భవన్ నిర్మాణం, కమ్యూనిటీ హాల్, ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా శ్మశానవాటికలను ఏర్పాటు చేసి అభివృద్ధి పర్చాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరహాలో తెలంగాణలో ప్రతి పాస్టర్‌కు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో కె. యోహాన్, వి.డానియేల్, ఎం.సంజీవరావు, సాల్మాన్‌రాజు, అశోక్, సిద్ధూ, విజయ రాజ్, సకినాల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రైల్వే అధికారుల తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్వే సీపీఎస్‌ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏడీఆర్‌ఎంఓ రాజీవ్ కుమార్ గంగేలీ సేఫ్టీ ఆడిటింగ్, తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం, మణుగూరు, కేటీపీఎస్, పాండురంగాపురం స్టేషన్లలో తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని ఉద్యోగులు, ఇన్‌స్పెక్టర్లు, కార్మికులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. తిరిగి రాత్రి కొత్తగూడెం చేరుకున్న వారు గురువారం భద్రాచలం వెళ్లి శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతారని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ఏసీఎం జాన్‌బెనహర్, సీనియర్ జీఎస్‌టీఈ ప్రియా అగర్వాల్, ఏడీఎంఈ రాజమోహన్, సీనియర్ డీఓవోఎం జి.మనోజ్‌కుమార్, ఏరియా ఆఫీసర్ రజినిష్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి మాజీ ఈఓ విరాళం



ఈఓ రమాదేవికి డీడీ అందజేస్తున్న రామకృష్ణంరాజు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని ఏటపాక వాసి, రామాలయం మాజీ ఈఓ రామకృష్ణ రాజు బుధవారం విరాళం అందచేశారు. తొలుత ఆయన కుటుంబ సమేతంగా అంతరాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ రమాదేవికి రూ.1,01,116 డీడీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవీందర్, శ్రీనివాస రాజు, ఏఈఓలు భవానీ రామకృష్ణ, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీలో బుధవారం కార్డియో వ్యాస్కులర్ హెల్త్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇండియన్ హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇన్సియేషన్, షుగర్ వ్యాధిపై వివరించారు. గ్రామస్థాయిలో క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేసి రక్తపోటు, షుగర్, కేన్సర్ బాధితులను గుర్తించి, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి కందుల దినేష్, సిబ్బంది సత్యవతి, పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, జి.విజయ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

పాల్వంచరూరల్: భర్తతో గొడవ కారణంగా పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన వట్టం భూపతిరావు భార్య రమాదేవి(20) గత నెల 10న ఇంటివద్ద పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. భర్త భూపతిరావు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వేధించడం వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ మృతురాలి తండ్రి కాలం బాబూరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.శ్రీనివాస్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

దమ్మపేట: బైక్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో యువకుడు గాయాలపాలైన సంఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపుగా వెళ్తున్న లారీ మందలపల్లి గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు నార్లపాటి సాయి రోడ్డుపై పడటంతో స్వల్ప గాయాలు కాగా, బైక్ బాగా దెబ్బతిన్నది. స్థానికులు క్షతగాత్రుడిని దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

వేసవి కావడంతో అధికంగా వాడకం

- దుబారా కాకుండా విద్యుత్ శాఖ చర్యలు
- ఆదా చేయాలని సూచనలు



భద్రాచలం ఐటీడీఏ రోడ్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: వేసవి తాపం పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. గతంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే అధిక వినియోగం జరగ్గా, ఈ ఏడాది మార్చి నుంచే జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లా విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం సగటున జనవరి 2023లో 3.679 మిలియన్ యూనిట్లు.. అంటే నెలకు 114.041 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. ఫిబ్రవరిలో రోజుకు 4.36 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగ్గా, అదే నెలకు 122.087 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. క్రమంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ దుబారాను అరికట్టడంతోపాటు ఆర్థిక భారం నుంచి తప్పించుకోవచ్చు. కాగా జిల్లాలో గృహ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు కలిపి 4,25,537 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

పెరిగిన ఏసీలు

జిల్లాలో ఏసీల వినియోగం పెరిగిందని అధికారులు గుర్తించారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోందని, పీక్ సమయాల్లో ఫీడర్లలో లోడ్ బ్యాలెన్సింగ్ సమస్యలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. విద్యుత్ దుబారా పెరిగితే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వేసవిలో విద్యుత్‌కు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో సౌర విద్యుత్ వినియోగిస్తే మేలని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక్కసారి పెట్టుబడి పెట్టి ఏళ్ల తరబడి ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చని, నివాస భవనాలు, వ్యవసాయ క్షేత్రాలు, ఖాళీ స్థలాల్లో సౌర విద్యుత్ ప్లాంటును నెలకొల్పుకోవాలని వివరిస్తున్నారు. జిల్లాలో డిమాండ్, సరఫరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్ ఆధ్వర్యంలో లోడ్ బ్యాలెన్సింగ్ చర్యలు చేపడుతున్నారు.

అధికారుల చర్యలు..

- జిల్లాలో అధిక విద్యుత్ వినియోగం (ఓవర్ లోడ్) కలిగిన ఫీడర్లు గుర్తించి సమీపంలో ఉండే వేరే ఫీడర్లకు బదలాయిస్తున్నారు.
- లోడ్ బ్యాలెన్సింగ్ కోసం కొత్త ఫీడర్లు, లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.
- లోడ్ బ్యాలెన్సింగ్ కోసం అధిక వినియోగం ఉన్న భద్రాచలం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.
- ఈ ఏడాది మార్చిలో 58, ఏప్రిల్‌లో ఇప్పటివరకు 72 విద్యుత్ నియంత్రికలు (డీటీఆర్) ఏర్పాటు చేశారు. లోడ్ బ్యాలెన్స్‌పాటు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టారు.
- ఏసీల వినియోగం భారీగా పెరిగిపోవడంతో విద్యుత్ డిమాండ్ కంటే వినియోగం 10 శాతం పెరిగినట్లు అధికారిక అంచనాలున్నాయి.
- ఏసీలు 24 డిగ్రీల్లో పెట్టుకుని వినియోగిస్తే బిల్లు తక్కువగా వచ్చే అవకాశాలుంటాయి.

పొదుపు చేద్దాం ఇలా..

- విద్యుత్ గృహోపకరణాలు నాణ్యమైనవి వినియోగించాలి.
- సాధారణ చల్లదనం కోసం సగటు ఉష్ణోగ్రత వద్ద ఏసీని సెట్ చేసుకోవాలి
- ఎల్‌ఈడీ బల్బులను వాడితే 60 శాతానికిపైగా విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.
- ఫ్రిజ్ డోర్లను రోజంతా పదే పదే తెరవకుండా వీలైనంత తక్కువ తెరవాలి.
- వాషింగ్ మిషన్లలో బట్టలన్నీ ఒకేసారి నానబెట్టి ఉతకాలి.
- కూలర్లు, ఫ్యాన్లు, వ్యవసాయ పంపుసెట్లను అవసరం మేరకే వినియోగించాలి.
- మిక్సీ, గ్రైండర్, గ్లీజర్లను అవసరమున్నంత మేరకే ఉపయోగిస్తూ విద్యుత్ వాడకాన్ని తగ్గించాలి.
- పగటి వేళల్లో కూలర్లు, ఏసీలు వినియోగించకుండాబ ఇంటి ఆవరణ, ఆరుబయట, పచ్చని చెట్ల కింద సేద తీరడం వల్ల విద్యుత్ ఆదా చేయొచ్చు.
- మసాల దినుసులు, ఆహార పదార్థాల తయారీలను మిక్సీలు, గ్రైండర్లు వినియోగించడం కంటే సంప్రదాయ పద్ధతిలో రోకలి బండతో రుబ్బు కోవడం ఆరోగ్య రీత్యా ఉత్తమం.
- వ్యాపార సముదాయాల్లో విద్యుత్‌ను వినియోగించేటప్పుడు సగటున పనిని ఏక కాలంలో చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చు.

విద్యుత్ ఆదా బాధ్యత..



విద్యుత్ వినియోగానికి సరిపడా సరఫరా ఉన్నప్పటికీ విద్యుత్‌ను ఆదా చేయడం వినియోగదారులు బాధ్యతగా భావించాలి. నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించుకోవాలి. వ్యవసాయ క్షేత్రాల్లో అనవసరంగా పంపుసెట్లను ఆన్‌లో ఉంచకూడదు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఎలక్ట్రికల్ వస్తువులను విధిగా ఆఫ్ చేయాలి.

–జీవన్, భద్రాచలం డీఈ

స్వీయ నియంత్రణ పాటించాలి



వేసవిలో లోడ్ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి లోడ్ బ్యాలెన్సింగ్ చర్యలు మొదలుపెట్టాం. ప్రస్తుతానికి డిమాండ్ కంటే వినియోగం అధికంగా ఉంది. వినియోగదారులు స్వీయ నియంత్రణ పాటించాలి. ముఖ్యంగా ఏసీల వినియోగం పెరిగిపోవడంతో అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. సోలార్ ఉత్పత్తులు, ఎల్‌ఈడీలను వినియోగిస్తే బిల్లులు తగ్గుతాయి.

–రమేష్, ఎస్‌ఈ

కలెక్టరేట్ ఎదుట వీఓఏల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ 17 రోజు నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేష్ అన్నారు. బుధవారం వీఓఏలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వంటావార్పు నిర్వహించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వీఓఏలకు నెలకు రూ.3,900 మాత్రమే ఇస్తున్నారని, పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామ సంఘానికి పక్కా భవనం నిర్మించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవీ అప్పారావు మాట్లాడుతూ రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వీఓఏల నాయకులు జి.పద్మ, వీరన్న, శ్రీను, గోపాల్, వెంకటేశ్వర్లు, చంద్రలీల, రేష్మ, వసంత, రాజమణి, మాధవి, రమేష్, మైమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆదివాసీ యువకులు

- వారికి హాని జరగకుండా గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తాం
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య

కొత్తగూడెంటౌన్: ఆదివాసీ యువకులు ముగ్గురిని ఆరు రోజుల క్రితం జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తమ వద్ద సమాచారం ఉందని మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఎలాంటి ప్రాణహాని లేకుండా కుటుంబాలకు అప్పగించాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బాసగూడ పంచాయతీ పరిధిలోని పెద్ద గెల్లాగు ఆదివాసీ గ్రామానికి చెందిన యువకులు పద్దం కల్లు, కుంజం సేతు, ఎల్యా భీమాను గత నెల 28న ఆర్.కొత్తగూడెం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తమ వద్ద సమాచారం ఉందని తెలిపారు. ఈ విషయమై తమ సంస్థ కార్యకర్తలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాకబు చేయగా.. తమకు ఏమి తెలియదని, ఛత్తీస్‌గఢ్ పోలీసులే తీసుకువెళ్లారంటూ పోలీసులు అస్పష్టమైన సమాధానాలు చెబుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఆదివాసీ యువకులకు ఎలాంటి హాని జరగకుండా రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ తదితరులు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వం అనుసరిస్తున్న విధానాలు నచ్చక, ఆపరేషన్ చేయూతతో కనువిప్పు కలిగి మావోయిస్టు దంపతులు మడకం సోనా, మడకం జోగి పోలీసుల ఎదుట లొంగిపోయారని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా చింతల్నార్ గ్రామానికి చెందిన మడకం సోనా 2015లో నిషేధిత మావోయిస్టు పార్టీలో చేరి మూడేళ్లు ప్లాటూన్ కమిటీలో పని చేశాడని, పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్నకు అంగరక్షకుడిగా వ్యవహరించాడని, ప్రస్తుతం భీమాపూరం గ్రామానికి చెందిన డీఏకేఎంఎస్ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నాడని తెలిపారు. చర్ల మండలం కొండవాయికి చెందిన మడకం జోగి అలియాస్ వేగో, అలియాస్ రాధ మావోయిస్టు పార్టీ తెలంగాణ దివంగత కార్యదర్శి హరిభూషణ్‌కు బాడీగార్డుగా పని చేశారని తెలిపారు. రెండేళ్ల క్రితం వీరిరువురూ పెళ్లి చేసుకున్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక, ఆదివాసీల పట్ల వారు అనుసరిస్తున్న తీరుతో అసహనం చెంది జన జీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఆపరేషన్ చేయూత సత్ఫలితాలు ఇస్తోందని, జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ కార్యక్రమాలతో మావోయిస్టు దళ సభ్యులు, నాయకులు బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవితం గడపాలనుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, లొంగిపోవాలనుకునే వారు స్థానిక పోలీసుస్టేషన్ లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. అనంతరం లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్, అడిషనల్ కమాండెంట్ కమల్‌వీర్ యాదవ్, 81 బెటాలియన్ కమాండెంట్ పియూష్ తివారీ, చర్ల సీఐ అశోక్ పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎస్పీ'కి స్పందన

డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎస్పీ వినీత్ తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి 15 మంది ఫోన్ చేసి తమ సమస్యలు వివరించగా.. పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు ఏ సమస్య ఉన్నా ఫోన్‌లో చెప్పలేని వారు నేరుగా తనను కలవచ్చని అన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

ములకలపల్లి : అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ధాన్యం కల్లాలను బుధవారం పరిశీలించిన ఆయన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి అన్నదాతకు అండగా నిలిచేలా కొనుగోళ్లు వేగంగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, తరుగు, తేమ అంటూ కొర్రీలు పెట్టకుండా త్వరగా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమే అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు. కాగా, ములకలపల్లిలో వీఓఏల దీక్షా శిబిరాన్ని కూనంనేని సందర్శించి సంఘీభావం తెలిపారు.

సీపీఎం పోటీ చేసే స్థానాల్లో పోటీ చేయం

అశ్వారావుపేటరూరల్: అకాల వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. అశ్వారావుపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎంతో అవగాహన కుదిరినందున వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసే స్థానాల్లో సీపీఐ పోటీ చేయదని తెలిపారు. అయితే, తాను ఎక్కడి నుంచి పోటీ చేసేది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు నరాటి ప్రసాద్, నడిపల్లి నవీన్‌కుమార్, నరాటి రమేశ్, వీరూనాయక్, అనుల సాయి, బైరు సాయి, మౌలానా, గొడ్ల కొండయ్య, దుర్గాప్రసాద్, గొడ్ల రాజు, ఇమానియేల్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు దానం కనకలక్ష్మి, సయ్యద్ సలీం, ఎస్.కే.రఫీ, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరు మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక ప్రాంతంలోని ఎరచిలక మూల మలుపు వద్ద ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథం ప్రకారం.. రేగళ్ల గ్రామానికి చెందిన ధర్మరాజుల లాలయ్య (60) ద్విచక్ర వాహనంపై బంగారుచెలక గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలై రోడ్డు పక్కన పడిపోయిన లాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక లారీ పట్టివేత

భద్రాచలంఅర్బన్: అనుమతులు లేకుండా బూర్గంపాడు నుంచి భద్రాచలం పట్టణంలోకి ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించారు. లారీ యజమానిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

'దళితబంధు'పై విచారణ



విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు

అశ్వారావుపేటరూరల్: దళితబంధు పథకం లబ్ధిదారుడి నుంచి బీఆర్‌ఎస్ యువజన నాయకులు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు విచారణ చేపట్టారు. పత్రికల్లో వచ్చిన కథనాలతో స్పందించిన కలెక్టర్ అనుదీప్ విచారణకు ఆదేశించారు. దీంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు ఎంపీడీఓ కార్యాలయంలో దళితబంధు లబ్ధిదారురాలు దాసరి నాగరత్నం, బీఆర్‌ఎస్ యువజన నాయకులు ఆవుల చిన్ని, మోటూరి మోహన్‌ను విచారించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దళితబంధు పథకం మంజూరు కాకముందే ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులు కోళ్ల ఫారం షెడ్డు నిర్మాణం, బోరు, మోటారు కోసం నగదు తీసుకున్నట్లు తేలిందని, దీనికి, దళితబంధు నగదుకు సంబంధం లేదని తెలిపారు. అయితే తన వద్ద నుంచి దళితబంధు పేరు చెప్పి బీఆర్‌ఎస్ నాయకులు రూ.90వేల దాకా వసూలు చేసినట్లు బాధితురాల ఆరోపిస్తోందని, ఈ నగదును ఆమె తిరిగి చెల్లించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. బాధితురాలికి నగదు తిరిగి చెల్లించకపోతే బాధ్యులపై పోలీస్ కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దమ్మపేట సూపరింటెండెంట్ విద్యాధర్‌రావు ఉన్నారు.

సంతల నిలిపివేతను వ్యతిరేకించండి

మావోయిస్టు నేత ఆజాద్

చర్ల: మావోయిస్టులకు సరుకులు చేరవేస్తున్నారనే నేపంతో ఆదివాసీ ప్రాంతాల్లో వారపు సంతల నిలిపివేతను వ్యతిరేకించాలని మావోయిస్టు పార్టీ బీకే – ఏఎస్‌ఆర్ జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. చర్ల, దుమ్ముగూడెం, చింతూరు ప్రాంతాల చిరు వ్యాపారులు బూడుపాడు, యాంపురం, భీమారం, కొండపల్లి గ్రామాల్లో జరిగే సంతలలో ఆదివాసీలకు బియ్యం, నూకలు, పప్పులు, వస్త్రాల వంటి నిత్యావసర సరుకులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారని, ఈ క్రమంలో చర్ల, దుమ్ముగూడెం సీఐలు, ఎస్సైలు మావోయిస్టులకు సరుకులు తీసుకెళ్తున్నారంటూ వ్యాపారులను ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. పేలుడు పదార్థాల పేరుతో వారిని అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో నిత్యం కూంబింగ్ నిర్వహిస్తూ అటవీ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడి వారపు సంతలను పునరుద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు.

యువతి అదృశ్యం

భద్రాచలంఅర్బన్: యువతి అదృశ్యంపై బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్సై మధుప్రసాద్ కథనం ప్రకారం... పట్టణంలోని కొర్రాజులగుట్ట ప్రాంతానికి చెందిన యువతి బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వన్యప్రాణులను వేటాడొద్దు

ములకలపల్లి : వన్యప్రాణులను వేటాడొద్దని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ హెచ్చరించారు. అల్లిగూడేనికి చెందిన కొందరు యువకులు, దమ్మపేట మండలం రాచూరిపల్లికి చెందిన నాగరాజు కలిసి అటవీప్రాంతానికి వేటకు వెళ్లగా, నాటు తుపాకీ పేలి నాగరాజు మృతి చెందిన విషయం విదితమే. వీఆర్‌ఓ కనకం శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం డీఎస్పీ గ్రామస్తులకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాణాలు, విల్లంబులు ఇతర మారణాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టం చేశారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ టీడీ బంజార్‌కు చెందిన చిన్నం నరసింహారావు(35) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రెండు గొర్రెలు తప్పిపోవడంతో మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలోని తోటలోకి వెతికేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా బుధవారం గ్రామ శివారులోని మామిడితోటలో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి రాఘవులు ఫిర్యాదు మేరకు ఎస్సై షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక మద్యం మత్తులో ద్విచక్రవాహనం అదుపు తప్పి మృతి చెందాడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సుజాతనగర్: సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సమీపంలో గల విద్యానగర్(చుంచుపల్లి మండలం)లో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. 8 నెలలుగా పాఠశాల ఉపాధ్యాయుడొకరు సెల్‌ఫోన్లో బాలికకు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతున్నాడు. పాఠశాలలో తనను బావ అని పిలవాలంటూ వేధిస్తున్నాడు. బాలిక విషయం తండ్రి దృష్టికి తేవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.తిరుపతిరావు తెలిపారు.

తొమ్మిదోమైలు తండాలో చోరీ

టేకులపల్లి: చోరీ ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. తొమ్మిదోమైలుతండాకు చెందిన జాటోతు రమేష్ కటుంబంతో కలిసి మంగళవారం రాత్రి బేతంపూడి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు పగులకొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లి చూడగా బీరు తెరిచి 25 గ్రాముల బంగారు గొలుసు, 4 గ్రాముల ఉంగరం, 8 గ్రాముల పట్టీలు చోరీ చేశారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.